అమితాబ్‌కు అస్వస్థత



కోట్లాది అభిమానుల ఆరాధ్యనటుడు బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ అస్వస్థతకు గురయ్యారు. ముంబయిలోని కోకిలాబెన్ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం ఆయన చేరినట్టు తెలుస్తున్నది. తాజాగా ఆయన ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ పెట్టారు. 'ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటా' అంటూ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. తన అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొనే ఆయన ఆ పోస్ట్ పెట్టారని పలువురు అభిప్రాయపడుతున్నారు. బిగ్‌బీ హాస్పిటల్‌లో చేరడానికి గల కారణాలు తెలియాల్సివుంది. ప్రభాస్ పాన్ ఇండియా చిత్రం 'కల్కి'లో అమితాబ్ కీలక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే.

అనంద్ అవతారాలు

మిడిల్‌క్లాస్ మెలొడీస్, బేబీ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఆనంద్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'డ్యూయెట్'. మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియోగ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. రితిక నాయక్ కథానాయిక. శుక్రవారం ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'డ్యూయెట్' సినిమలో తాను పోషిస్తున్న 'మదన్' పాత్ర లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. మనసంతా ప్రేమను నింపుకున్న ప్రేమికుడిగా ఇందులో ఆనంద్ దేవరకొండ కనిపిస్తారని, త్వరలోనే 'డ్యూయెట్' సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. విభిన్నమైన ప్రేమకథాచిత్రంగా రూపొందుతోన్న 'డ్యూయెట్' ప్రస్తుతం నిర్మాణ దశలో ఉందని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించేలా దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారని నిర్మాత తెలిపారు. రావు రమేశ్ ఇందులో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు.అలాగే ఆనంద్ దేవరకొండ నటిస్తున్న మరో చిత్రం 'గం..గం..గణేశా'. ఈచిత్రం కూడా నిర్మాణదశలో ఉంది. ఆనంద్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాకు చెందిన కొత్త పోస్టర్‌ని నిర్మాతలైన కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి విడుదల చేశారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రానికి దర్శకుడు. ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా కథానాయికలు. త్వరలో సినిమా విడుదల కానుంది.

పూర్వ వైభవం కోసం..

అగ్ర కథానాయిక పూజాహెగ్డేకు గత రెండేళ్లుగా అంతగా కలిసి రావడం లేదు. తెలుగులో 'అల వైకుంఠపురములో' తర్వాత ఒక్క విజయాన్ని దక్కించుకోలేకపోయింది. కెరీర్ వరుస వైఫల్యాలతో కొనసాగుతున్నా ఏ మాత్రం ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తాననే ధీమాతో ఉంది పూజాహెగ్డే. తాజా సమాచారం ప్రకారం ఈ భామ రెండు భారీ ప్రాజెక్ట్‌లలో భాగం కానున్నట్లు తెలిసింది. 'పుష్ప-2' చిత్రం తర్వాత అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. బన్నీకి కథ చెప్పానని, ఇద్దరి మధ్య చర్చలు జరుగుతున్నాయని అట్లీ ఓ సందర్భంలో తెలిపారు. ఈ సినిమాలో పూజాహెగ్డే కథానాయికగా నటించనుందని తమిళ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఇక మరో సినిమా విషయానికొస్తే... నందినీ రెడ్డి దర్శకత్వంలో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. తొలుత ఇందులో సమంతను నాయికగా అనుకున్నారట. అయితే ప్రస్తుతం ఆమె సినిమాలకు బ్రేక్ తీసుకోవడంతో ఆమె స్థానంలో పూజాహెగ్డేను కథానాయికగా ఎంపిక చేసే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఒకవేళ ఈ రెండు సినిమాల్లో పూజా హెగ్డే నాయికగా ఖరారైతే కెరీర్ తిరిగి పుంజుకుంటుందని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.

'పెద్ది'గా రామ్‌చరణ్?

రామ్‌చరణ్ సినిమా అంటేనే విడుదలకు ముందు హైప్ కామన్. దానికితోడు 'ఉప్పెన' లాంటి బ్లాక్‌బాస్టర్ హిట్ ఇచ్చిన బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్ సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ప్రస్తుతం ఈ సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు చెందిన ఓ వార్త సాంఘిక మాధ్యమాల్లో జోరుగా వినిపిస్తున్నది. వివరాల్లోకెళ్తే.. రామ్‌చరణ్, బుచ్చిబాబు కలయికలో వస్తున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్‌కు 'పెద్ది' అనే పేరును ఖరారు చేసినట్టు ఆ వార్త సారాంశం. నిజానికి ఈ టైటిల్‌ని ఎన్టీయార్ సినిమాకోసం బుచ్చిబాబు రిజిస్టర్ చేయించారు. ఇప్పుడు అదే పేరును చరణ్ సినిమాకు వాడుతున్నట్టు తెలుస్తున్నది. అయితే.. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సివుంది. ఇదిలావుంటే.. ఈ నెల 20న లాంఛనంగా పూజా కార్యక్రమం నిర్వహించి, ఈ సినిమాకు చెందిన పూర్తి వివరాలను నిర్మాతలు ప్రకటించనున్నారట. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకటసతీశ్ కిలారు నిర్మించనున్న ఈ సినిమాకు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. జాన్వి కపూర్ ఇందులో కథానాయిక. విజయ్‌సేతుపతి విలన్‌గా నటిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

'భీమా' అంచనాలను అందుకుంది

'మైథాలజీ, ఫాంటసీ కలబోసి ఈ సినిమాను అద్భుతంగా తీశారు. క్లైమాక్స్ ఫైట్ చూసినప్పుడు పరశురాముడు ఇలానే ఉంటాడేమో అనిపించింది. గోపీచంద్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు' అన్నారు సంపత్‌నంది. శుక్రవారం జరిగిన 'భీమా' థాంక్స్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోపీచంద్ హీరోగా ఏ.హర్ష దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ నిర్మించిన 'భీమా' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ 'సినిమా బాగుందని, రెండు కారెక్టర్స్‌లో నేను చక్కటి వేరియేషన్స్ చూపించానని అందరూ ప్రశంసిస్తున్నారు. యాక్షన్, గ్రాఫిక్స్‌తో ఎక్స్‌ట్రార్డినరీ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించే చిత్రమిది. ఈ స్థాయి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు. గోపీచంద్‌కు మాస్‌పల్స్ బాగా తెలుసునని, క్లైమాక్స్ ఘట్టాలు అదిరిపోయానని దర్శకుడు మారుతి అన్నారు. ఈ సినిమా అంచనాలను అందుకుందని, రోజు రోజుకీ వసూళ్లు పెరుగుతున్నాయని నిర్మాత రాధామోహన్ పేర్కొన్నారు.

నవ్వులతో థియేటర్లు బద్దలవుతాయి

' ఈ నెల 22న మా థియేటర్స్‌కి రండి. మీరు నవ్విన నవ్వులకు థియేటర్లు బద్దలైపోతాయి. పిచ్చిపిచ్చిగా ఎంజాయ్ చేస్తారు. ఫ్రెండ్స్‌తో రండి.. ఇంకా బాగా ఎంజాయ్ చేస్తారు. కేవలం నవ్వించడానికే తీసిన సినిమా ఇది. ఇందులో నన్నూ భాగం చేసిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు.' అని శ్రీవిష్ణు అన్నారు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణతో కలిసి ఆయన నటించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. వి.సెల్యులాయిడ్, బలుసు సునీల్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవిష్ణు మాట్లాడారు. ప్రేక్షకులకు డబుల్‌డోస్ ఎంటర్‌టైన్మెంట్ ఇస్తామని ప్రామిస్ చేస్తున్నామని, నిర్మాతల వల్లే ఇంత క్రేజీ మూవీ చేయగలిగామని ప్రియదర్శి చెప్పారు. ట్రైలర్‌లో వుండే ఎనర్జీకంటే వందరెట్లు ఎనర్జీ సినిమాలో ఉంటుందని, థియేటర్లకు వచ్చినవాళ్లను టెన్‌టైమ్స్ ఎంటర్‌టైన్ చేస్తామని, ఇది తమ గ్యారంటీ అని దర్శకుడు తెలిపారు. ఇంకా చిత్ర తారాగణం మొత్తం మాట్లాడారు.

'అందాజ్ అప్నా అప్నా' సీక్వెల్ కోసం..

అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్ నటించిన 'అందాజ్ అప్నా అప్నా' (1994) చిత్రం కామెడీ జోనర్‌లో కల్ట్ క్లాసిక్‌గా మిగిలిపోయింది. ఈ చిత్రంలో అమర్, ప్రేమ్ పాత్రల్లో అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్ పండించిన హాస్యం అందరినీ అలరించింది. రాజ్‌కుమార్ సంతోషి ఈ చిత్రాన్ని దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమాకు సీక్వెల్ కోసం రంగం సిద్ధమవుతున్నదని అమీర్‌ఖాన్ వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన ఆయన ఈ విషయాన్ని తెలిపారు. 'దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి సీక్వెల్‌కు స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నాడు. కొద్దిరోజుల్లోనే ఈ సీక్వెల్‌పై మరింత స్పష్టత వస్తుంది' అని అమీర్‌ఖాన్ పేర్కొన్నారు.

'యమధీర' పోరాటం

కన్నడ నటుడు కోమల్ కుమార్, రిషీక శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'యమధీర'. శంకర్.ఆర్ దర్శకుడు. శ్రీమందిరం ప్రొడక్షన్స్ పతాకంపై వేదాల శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను నిర్మాత, నటుడు అశోక్ కుమార్ ఆవిష్కరించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'అజర్ బైజాన్, శ్రీలంక వంటి దేశాల్లో చిత్రీకరణ జరిపాం. క్రికెటర్ శ్రీశాంత్ ఈ సినిమాలో ప్రతి నాయకుడి పాత్రలో కనిపిస్తారు. యాక్షన్ హంగులతో ఆకట్టుకునే చిత్రమిది' అన్నారు. త్వరలో థియేటర్లలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత వేదాల శ్రీనివాస్ తెలిపారు. నాగబాబు, అలీ, సత్యప్రకాష్, మధుసూదన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రోష్ మోహన్ కార్తీక్, సంగీతం: వరుణ్ ఉన్ని, కథ, దర్శకత్వం: శంకర్ ఆర్.

పాత్ర తెచ్చిన గౌరవం

పాత్రల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించే బాధ్యత నటీనటులపై ఎంతైనా ఉంది. కానీ నూటికి 99శాతం కథానాయికలు మాత్రం కేవలం గ్లామర్ షోలకే పరిమితమైపోతున్నారు. అయితే.. మృణాల్‌ఠాకూర్‌ను మాత్రం అందులో మినహాయించాలి. 2018లో ఆమె నటించిన 'లవ్ సోనియా' చిత్రం మానవ అక్రమ రవాణా నేపథ్యంలో తెరకెక్కి విమర్శకుల ప్రశంసలందుకుంది. ఆ సినిమాలో మృణాల్ అద్భుతంగా నటించడమే కాదు, పాత్ర పరంగా కథానాయికలు చేయలేని సాహసాలను చేసిందనే చెప్పాలి. అందులోని కొన్ని సన్నివేశాలు సోషల్‌మీడియాలో ఇప్పటికీ ప్రత్యక్షమవుతుంటాయి. ఇదంతా దేనికంటే.. న్యూయార్క్‌లోని యూఎన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'హ్యూమన్ కాస్ట్ ఆఫ్ కాన్ఫ్లిక్ట్ రిలేటెడ్ సెక్సువల్ వయోలెన్స్' కార్యక్రమానికి మృణాల్ హాజరవ్వనుంది. మానవ అక్రమ రవాణా, బాధితుల సంఘర్షణ, లైంగిక హింస, వాటి దుష్పరిణామాలపై ఈ కార్యక్రమంలో పానెల్ చర్చించనుంది. ఆదే నేపథ్యంలో రూపొందిన 'లవ్ సోనియా' సినిమాలో హ్యూమన్ ట్రాఫికింగ్ బాధితురాలిగా మృణాల్ నటించిన కారణంగా సంస్థ ప్రతినిధులు ఈ చర్చలో ఆమెను కూడా భాగస్వామిని చేశారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమరవాణా, తర్వాతి పరిణామాలపై కీలక అంశాలను మృణాల్ ప్రస్తావించనున్నది. ఈ సందర్భంగా మృణాళ్ ఆనందం వ్యక్తం చేస్తూ- 'ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం. 'లవ్ సోనియా'లోని నా పాత్ర ద్వారా హ్యూమన్ ట్రాఫికింగ్ సమస్యలోని సంక్లిష్టతను లోతుగా అధ్యయనం చేసే అవకాశం నాకు దక్కింది.' అని మృణాల్ చెప్పుకొచ్చింది. ఈ కార్యక్రమంలో మృణాల్‌తో కలిసి పలువురు బాలీవుడ్, హాలీవుడ్ ప్రముఖులు పాల్గొననున్నారు.